సాక్షి గుంటూరు

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజీ నుంచి 5,009 క్యూసెక్కులు పశ్చిమ డెల్టాకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది.



పులిచింతలకు నీటి విడుదల

సత్రశాల(రెంటచింతల):టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి 2,84,677 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ తెలిపారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మను మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రతపై రాజీ వద్దు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్



గుంటూరు వెస్ట్ : ఈవీఎంల భద్రతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా భద్రత ఏర్పాట్లు, సీసీటీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎన్.షేక్ ఖాజావలి, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శుభం కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు సీజ్




దుగ్గిరాల : స్థానిక శుభం కోల్డ్ స్టోరేజ్‌లో ఆరుబయట ఉంచిన పసుపు బస్తాలను లోపల వేసి సీజ్ చేయాలని సిబ్బందిని తహసీల్దార్ ఐ. సునీత ఆదేశించారు. కోల్డ్ స్టోరేజ్‌లో గతంలో అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. అందులో మిగిలిన 1,169 బస్తాలను అప్పట్లో సీజ్ చేశారు. పురుగులు పడుతున్నాయని, వాటిని బయటకు తీసి యాజమాన్యం గ్రేడింగ్ చేస్తుండగా స్థానిక రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆమెతో పాటు పసుపు యార్డు సెక్రటరీ జె.వి. సుబ్బారావు హుటాహుటిన కోల్డ్ స్టోరేజ్‌కు చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సీజ్ చేసిన పసుపు బస్తాలను బయటకు ఎందుకు తీశారని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అనంతరం బస్తాలన్నింటిని లోపల వేసి, సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇద్దరు వీఆర్వోలు, యార్డ్ సిబ్బంది బస్తాలను లెక్కించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో అగ్రిసెట్ ఫలితాలు



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆగస్ట్ 18వ తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించిన అగ్రిసెట్– 2025 పరీక్ష ఫలితాలను సోమవారం వీసీ ఆర్. శారదజయలక్ష్మీదేవి విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, విత్తన సాంకేతికత పరిజ్ఞానం కోర్సుల్లో డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు నాలుగు సంవత్సరాల వ్యవసాయ డిగ్రీ కోర్సు చదువుకునేందుకు అర్హులవుతారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు 844 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోగా 813 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 753 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఫలితాలు మంగళవారం నుంచి విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రిజిస్ట్రార్ ఎం.వి. రమణ తెలిపారు. అగ్రిసెట్ కౌన్సెలింగ్ తదితర వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

జ్వాలాముఖి అమ్మవారికి మంగళసూత్రాల సమర్పణ



అమరావతి: స్థానిక అమరేశ్వరాలయంలోని జ్వాలాముఖి దేవి అమ్మవారికి అర్చక కుటుంబానికి చెందిన శంకరమంచి రామమోహనరావు కుమారుడు గణేష్‌కుమార్ బంగారు మంగళ సూత్రాలను సమర్పించారు. 12 గ్రాముల బరువుతో రూ.1.50లక్షల విలువైన రెండు బంగారు మంగళసూత్రాలను సోమవారం ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి ఈఓ రేఖకు అప్పగించారు.

బాలా త్రిపుర సుందరిగా భ్రమరాంబ

పెదకాకాని: అమ్మల గన్న అమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ అయిన శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు సోమవారం పలు ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల శక్తులకు అధినాయికి, జగన్మాత అయిన దుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీశారు. తొలిరోజు బాలత్రిపుర సందరీ దేవి అలంకరణలో అమ్మవారు నయన మనోహరంగా దర్శనమిచారు. అభయ హస్తంతో భక్తులకు ఆశీస్సులు అందజేశారు. పెదకాకాని శివాలయంలో శ్రీదేవి నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భ్రమరాంబ అమ్మవారు సోమవారం బాలా త్రిపురసుందరీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. కొరిటెపాడు సెంటర్‌లో ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ప్రతిష్ఠించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. గోరంట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా పూజలందుకున్నారు.



పెదకాకాని శివాలయంలో..



గుంటూరులోని కొరిటెపాడు సెంటర్‌లో..



గోరంట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్

గుంటూరు వెస్ట్: జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం పర్యవేక్షణతో పాటు అనారోగ్యకరమైన ఆహారం అమ్మకాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి గుంటూరు నగరంలో డయేరియా కేసులు కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరపాండ్యన్

బృందాన్ని ఏర్పాటు చేయాలి

డయేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందటానికి గల కారణాలు తెలుసుకోవడానికి, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కమ్యూనిటీ డిసీజ్ నిపుణులతో పాటు పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్ లేదా పంచాయతీ అధికారులు.. మెడికల్ కళాశాల, ప్రభుత్వ సమగ్ర వైద్యశాల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. బృందం సభ్యులు కేసులు నమోదవుతున్న సమయం, ప్రాంతం, వ్యాధి బారిన పడుతున్న వ్యక్తుల వయస్సు, క్లినికల్ అంశాలతో పాటు క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేయాలని ఆదేశించారు. దీనివల్ల నివారణ చర్యలు మరింత పటిష్టంగా చేపట్టడానికి అవకాశం ఉంటుందని సూచించారు. ప్రజలకు పూర్తిస్థాయిలో సురక్షితమైన మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించారు. వ్యాధులు నమోదవుతున్న ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలు లేని వాటర్ ప్లాంట్లను మూసి వేయించాలని ఆదేశించారు. అనారోగ్యకరమైన ఆహార పదార్థాలు విక్రయించకుండా నిరంతరం తనిఖీ నిర్వహించాలని చెన్నారు. ఆరోగ్య భద్రత నిబంధనలను ఉల్లంఘించే వారిపై రెవెన్యూ , పోలీస్ అధికారుల ద్వారా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డయేరియా నివారణ చర్యలు చేపడుతున్నాం : కలెక్టర్

కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జీఎంసీ పరిధిలో సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఇప్పటివరకు 146 మంది డయేరియా వ్యాధి లక్షణాలతో ఆసుపత్రిలో చేరారని పేర్కొన్నారు, ప్రస్తుతం 84 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మిగతావారు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. డయేరియా కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో తాగునీటికి పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు మరింత మెరుగుపరిచేలా నగరపాల సంస్థ అధికారులతో కలిసి చర్యలు తీసుకున్నామని వివరించారు. ట్యాంకుల ద్వారా పూర్తిస్థాయిలో రక్షిత మంచి నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆహార భద్రత కమిషనర్ వ్యక్తిగత శుభ్రతపై జారీ చేసిన ప్రచార పోస్టర్‌ను వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్, కమిషనర్, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో ఈఎన్సీ ప్రభాకర్‌రావు, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేసు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణా యశస్వి, ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను ప్రకటిస్తున్న వీసీ, సిబ్బంది

పెదకాకాని: ఏఎన్‌యూ పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికి రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ దూర విద్యా కోర్సులకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె. గంగాధరరావు, వర్సిటీ ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ సోమవారం విడుదల చేశారు. దూరవిద్య కేంద్రం పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత ఆదివారం 10 పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఎంబీఏకు 600 మంది దరఖాస్తు చేసుకోగా 444 మంది పరీక్షకు హాజరు కాగా, 435 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. ఎంసీఏకు 128 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 82 మంది పరీక్షకు హాజరు కాగా, 80 మంది అర్హత సాధించారని వివరించారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు !



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్ : ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిత సమయంలో పరిష్కరించాలని తెలిపారు. అనంతరం వచ్చిన 291 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి , గంగరాజు , గుంటూరు ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

ఇంగ్లిష్ మీడియాన్ని కొనసాగించాలి

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఆంగ్ల బోధన చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా పాఠశాలల్లో తొలగించారు. పేద పిల్లలు అంతర్జాతీయ పోటీలను తట్టుకోవాలంటే ఆంగ్ల మీడియం తప్పనిసరి. తప్పకుండా ఆంగ్ల విద్యాబోధన పునఃప్రారంభించాలి.

–డి. ఏడుకొండలు షెఫర్డ్, కె.మహమ్మద్ నూర్, ఇంగ్లిష్ విద్యా పరిరక్షణ వేదిక సభ్యులు, గుంటూరు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే రాజీనామా చేయాలి



గుంటూరు రూరల్ మండలంలోని తురపాలెంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 30 మంది మరణించారు. ఇప్పటి వరకు ఎటువంటి నష్టనివారణతో పాటు కనీసం తమ బాధల్ని కూడా పంచుకోలేని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వెంటనే రాజీనామా చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించి అమాయకులు చావులకు కారణమైన అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి. ఇవి ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే. బాధిత కుటుంబాలకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలి. కూటమి ప్రభుత్వ పెద్దలు తురకపాలెంలోని ఉండి సమస్యలు పరిష్కరించాలి.

– కుల, దళిత ప్రజా సంఘాల నాయకులు

బాపట్ల బీచ్ ఫెస్టివల్ వాయిదా

జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగిరెడ్డి

బాపట్ల: సూర్యలంక బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేసినట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఫెస్టివల్‌ను వాతావరణంలో మార్పులు కారణంగా వాయిదా వేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. మళ్లీ తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటన విడుదల చేస్తామని వివరించారు.



నగరోత్సవంలో భాగంగా పల్లకీపై ఊరేగుతున్న ఆది దంపతులు

వైభవంగా ప్రారంభమైన 'శరన్నవ' సంబరం

జగన్మాత కనక దుర్గమ్మ భక్తకోటి హృదికి బాలగా, నిత్య కల్యాణశీలిగా సాక్షాత్కరించిన వేళ.. దేదీప్యమానమైన ఇంద్రకీలాద్రి భక్త కోటితో మరింత తేజోమయమైంది. నవరాత్రుల శోభ విజయవాడ నలుదిశలా పండువెన్నెలలా ప్రకాశించింది. ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. భజన బృందాలు.. కోలాటాలు.. సాంస్కృతిక కార్యాక్రమాల సందడితో దుర్గగుడి పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

పూర్ణఫలం.. బాలానందం

- తొలి రోజు బాలా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం
- తొలి దర్శనం చేసుకున్న మంత్రులు, జిల్లా అధికారులు
- భక్తులతో పోటెత్తిన ఇంద్రకీలాద్రి
- వేడుకగా ఆది దంపతుల నగరోత్సవం



అమ్మ దర్శనానికి క్యూలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజల అనంతరం దర్శనాలకు అనుమతించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి అనిత, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, దుర్గగుడి ఈవో శీనానాయక్‌లతో పాటు పలువురు జిల్లా అధికారులు తొలి దర్శనం చేసుకున్నారు. ఉదయం 8 గంటలకు అన్ని క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ప్రధాన ఆలయంలోని అమ్మవారి ఉత్సవ మూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తీసుకువెళ్లి ప్రతిష్ఠించారు. అక్కడ అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం సమీపంలోని యాగశాలలో కలశస్థాపన, పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

జన హృది బాలా.. నిత్యకల్యాణశీలా..

మహా మండపం ఆరో అంతస్తులో ప్రత్యేక కుంకుమార్చనలో 104 మంది ఉభయదాతలు ఆలయ ప్రాంగణంలో శ్రీచక్రనవార్చనలో 13 మంది, చండీ యాగంలో 29 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న వారికి రూ. 300 క్యూలైన్‌లో బంగారు వాకిలి దర్శనం కల్పించారు. ఇక పరోక్ష చండీ హోమానికి 57 మంది, కుంకుమార్చనకు 18 మంది రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో పూజను వీక్షించారు. మహా మండపం ఆరో అంతస్తులో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నయనానందకరం.. నగరోత్సవం..

ఆది దంపతుల నగరోత్సవ సేవ సోమవారం సాయంత్రం కనుల పండువగా సాగింది. శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పాటు కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, కావడి నృత్యాలతో పలువురు కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కనకదుర్గనగర్, రథం సెంటర్, దుర్గాఘాట్, దుర్గగుడి ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది.

దుర్గగుడిపై నేడు

శ్రీగాయత్రీదేవి అలంకారం

- తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7 గంటలకు, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం (యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- సాయంత్రం 4 గంటలకు శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ సేవ
- సాయంత్రం 6 గంటలకు మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,400 గరిష్ఠం : రూ. 3,400

మోడల్ ధర రూ. 2,900

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1173

కొమ్ములు : 957 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,325	10,785	10,650

కాయలు : 216 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,325	10,650	10,525

మొత్తం అమ్మకాలు : 879.75 క్వింటాళ్లు

క్లుప్తంగా

మాతృ మరణాలను అరికట్టాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: గుంటూరులోని కార్యాలయంలో సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ లెవెల్ మాతృ మరణాల సమీక్ష సమావేశం జరిగింది. చేబ్రోలు, నిడమర్రు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జులై, ఆగస్టుల్లో జరిగిన మూడు మాతృ మరణాలపై సభ్యులు సమీక్షించారు. మరణానికి గల కారణాలను అధ్యయనం చేశారు. అందులో ఒకటి నివారించగలిగినదిగాను, రెండు నివారించలేనివి గాను నిర్ధారించారు. సమావేశానికి హాజరైన ఆశా కార్యకర్తలు,ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వైద్యాధికారులతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని చెప్పారు. తొలుత ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రమాదకర పరిస్థితులు సంభవించినప్పుడు ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించి, మాతృ మరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు , ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ , జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కొల్లిపర: మండల పరిధిలోని చివలూరు శివారు జగనన్న కాలనీ సమీపంలో సోమవారం రాత్రి 10గంటలు సమయంలో ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఇద్దరు గాయపడ్డారు. కొల్లిపరకు చెందిన కంచర్ల విశ్వాస్, సుధీర్‌లు చివలూరుకు వెళుతున్నారు. ఈ సమయంలో తెనాలి నుంచి గుదిబండి వారిపాలేనికి వస్తున్న ఆటో జగనన్న కాలనీ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశ్వాస్ అక్కడికక్కడే మృతి చెందగా సుధీర్ గాయపడ్డాడు. ఆటోలో ఉన్న శేషం కృపారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా పోలీసులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోసపోయాం.. న్యాయం చేయండి!

ఎస్పీ గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన ఫిర్యాదులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)కు ఫిర్యాదుదారులు వెల్లువెత్తారు. ఆర్థిక సంబంధమైన అంశాలతో పాటు వివిధ రకాల ఫిర్యాదులతో వచ్చిన బాధితులు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు మొరపెట్టుకున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా అడ్మిన్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు భానోదయ, కె.అరవింద్ వాటిని సంబంధిత పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న అడ్మిన్ ఎస్పీ రమణమూర్తి

ఐర్లాండ్‌లో అడ్మిషన్ పేరిట మోసం



కుమార్తెను ఐర్లాండ్‌లో ఎంబీఏ చదివించేందుకు అడ్మిషన్ కోసం గుంటూరు లక్ష్మీపురంలోని వరల్డ్ వైడ్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ కన్సల్టెన్సీ నిర్వాహకులకు 2024 జూన్‌లో రూ.12.21 లక్షలు చెల్లించాం. సంస్థ ప్రతినిధి ఎస్.రవికుమార్ మా నుంచి చెక్కుల రూపంలో నగదు తీసుకున్నాడు. పేరు రాయకుండా తీసుకున్న చెక్కులను బి.నీహారిక పేరుతో డ్రా చేసుకున్నాడు. డబ్బు కట్టించుకున్న తరువాత అమ్మాయికి అడ్మిషన్ ఖరారు కాకపోవడంతో పలు మార్లు కన్సల్టెన్సీకి వెళ్లి విచారించగా, రవికుమార్ కార్యాలయంలో ఉండకుండా ఫోన్‌లోనే సమాధానమిస్తున్నాడు. డబ్బు వసూలు చేసి అడ్మిషన్ కల్పించకపోగా, రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటుడంతో తమ బిడ్డ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. వ్యవసాయం చేసుకునే రైతునైనా అమ్మాయికి మంచి భవిష్యత్తు కావాలని ఆర్థికంగా భారమైనప్పటికీ పెద్ద మొత్తంలో చెల్లించాం. కన్సల్టెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుని, చెల్లించిన డబ్బు తిరిగి ఇప్పించాలి.

–అవిసెన కోటిరెడ్డి, వాలపల్లి, బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా

కొడుకుపై చర్యలు తీసుకోవాలి



నేను వృద్ధుడిని.. వికలాంగుడిని. వృద్ధుల మనే కనికరం లేకుండా కన్న కొడుకు దశరథ రాము వేధింపులకు గురి చేస్తున్నాడు. తాగుడుకు బానిసగా మారి, అర్ధరాత్రి వేళ ఇంటికి వచ్చి చంపేందుకు ప్రయత్నించాడు. భయంతో పొరుగువాళ్ల ఇంట్లో ఆశ్రయం పొందాం. ఇంటిని ఆక్రమించుకుని, భయభ్రాంతులకు గురి చేస్తున్న కొడుకుపై చర్యలు తీసుకుని, మాకు రక్షణ కల్పించాలి.

–కూరాకుల వెంకట్రావు, నాగ మల్లేశ్వరి, గుంటూరు

డబ్బు అడిగితే చంపుతామని బెదిరింపులు



కందుల బ్రోకరేజీ వ్యాపారం చేస్తూ, అవసరమైన వ్యాపారులకు మధ్యవర్తిగా ఉండి సరఫరా చేయిస్తుంటాను. గత తొమ్మిదేళ్లుగా ఆదిలాబాద్‌కు చెందిన సత్యనారాయణ దాల్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు అర్జున కేడియా, లలిత్ కేడియాతో వ్యాపారం చేస్తున్నాను. 2024 జూలైలో రెండు దఫాలుగా 3,250 క్వింటాళ్ల కందులను సేకరించి ఆదిలాబాద్‌కు పంపాను. ఇందుకు గానూ వారు రూ.3.54 కోట్లు చెల్లించాలి. ఇంత వరకు పైసా ఇవ్వలేదు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాను. డబ్బు అడిగితే చంపుతామని అర్జున్ కేడియా, లలిత్ కేడియా బెదిరించారు. డబ్బులు ఇప్పించడంతో పాటు తనను బెదిరించిన మిల్లు నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– సకలా వెంకటేశ్వరరావు, గుంటూరు

మిర్చి డబ్బులు ఇవ్వడం లేదు

నేను వ్యవసాయం చేస్తున్నాను. గుంటూరుకు యార్డుకు గత పదేళ్లుగా మిర్చి అమ్మకాలు జరుపుతున్నాను. 2024 ఏప్రిల్‌లో మాఊరు అబ్బిరాజుపాలేనికి వచ్చిన పులిపాటి ఆనంద్ మిర్చి పంటను కొనుగోలు చేస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి 50 బస్తాలను రూ.2.14 లక్షలకు విక్రయించాను. డబ్బు చెల్లించకుండా బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నాడు. తనకు పెద్దల అండ ఉందని, దిక్కున్న చోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నాడు. ఆనంద్‌పై చర్యలు తీసుకుని, డబ్బు ఇప్పించాలి.

–చిరుమామిళ్ల వెంకట్రావు, పెదకూరపాడు

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశం

గుంటూరు వెస్ట్: ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు ఓటర్ల జాబితాను మరింత వేగంగా, పారదర్శకంగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో సోమవారం ఈఆర్‌ఓలు , ఏఈఆర్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ రివిజన్ ద్వారా జిల్లాలోని బూత్ లెవల్ అధికారులంతా 2002 నుంచి 2025 వరకు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అందిన ఫిర్యాదులను ఈ నెల 30 నాటికి పరిష్కరించాలని చెప్పారు. ఓటరు జాబితాలు మరింత మెరుగ్గా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అందించాలని ఆమె కోరారు. ఆధార్ కార్డుకు ఓటరు కార్డు అనుసంధానం చేస్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. ఆధార్ కార్డు అనుసంధానం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారిని తొలగించే అవకాశం ఉంటుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గతంలో 1200 ఓట్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారని, రానున్న ఎన్నికల్లో వెయ్యి మందికి ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. వలస కార్మికుల ఆధార్ కార్డు ఎక్కడ ఉందో అక్కడే వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఒక వ్యక్తి ఒక ఓటు మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే చేయడం లేదని, తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి జాబితాను పరిశీలించాలని చెప్పారు. ఓటింగ్ రోజు మాత్రమే కాకుండా ఓటింగ్ ముందు రోజు కూడా సెలవు ప్రకటించేలా చూడాలని రాజకీయ పార్టీలు నేతలు కోరారు. సమావేశంలో రెవెన్యూ అధికారి ఎన్‌ఎస్‌కే ఖాజావలి, ఈఆర్వోలు, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీ కుమారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, ఎలెక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఎలుకల బెడద నివారించాలి

గుంటూరు వెస్ట్ : రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఎలుకల ఇబ్బంది లేకుండా రైతులకు వ్యవసాయాధికారులు సాయమందించాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఆమె సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్లు , కరపత్రాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన – అర్బన్ 2.0 అంగీకార్– 2025 ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి సాగు చేసే గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌ఎస్‌కే ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పల్నాడు జిల్లాకు 1860 టన్నుల యూరియా

నాదెండ్ల: జిల్లాకు మూడో విడతగా 1860 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు నరసరావుపేట ఏడీఏ కేవీ శ్రీనివాసరావు చెప్పారు. సాతులూరులోని రైల్వే ఎరువుల రేక్ పాయింట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఎరువులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, గ్రోమోర్, డీలర్లకు నిష్పత్తి ప్రకారం పంపిణీ చేయాలని స్థానిక వ్యవసాయాధికారులను ఆదేశించారు. పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. ఆయనతోపాటు ఏవో శ్రీలత, సిబ్బంది జీపీ శ్రీనివాసరావు ఉన్నారు.



సాతులూరులో రేక్ పాయింట్ వద్ద ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారులు

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్

- 3.5 కేజీల గంజాయి స్వాధీనం
- ఎనిమిది బైక్‌లను సీజ్ చేసిన అరండల్‌పేట పోలీసులు

లక్ష్మీపురం: చెడు వ్యసనాలకు అలవాటుపడి గంజాయి విక్రయిస్తూ, ద్విచక్ర వాహనాలు చోరీ చేసే ఎనిమిది మంది అంతర్రాష్ట్ర దొంగలను అరండల్‌పేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం .. సోమవారం బ్రాడీపేటలో కొంత మంది గుంపుగా చేరి గంజాయి విక్రయిస్తున్నట్లు అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజుకు సమాచారం వచ్చింది. హుటాహుటిన ఆయన ఎస్‌ఐ కృష్ణబాజీ, సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించగా కొంత మంది పరారయ్యారు. మిగిలిన వారిలో శ్రీనగర్‌కు చెందిన ఇంజాపల్లి మేరిబాబు, వెంగళరావునగర్‌కు చెందిన యద్దనపూడి దీనభాస్కర్, శారదా కాలనీకి చెందిన బడుగు ప్రభుకుమార్, ఒక మైనర్ బాలుడు, గోరంట్లకు చెందిన పణిదరపు అమరజ్యోతి, వెంగళరావు నగర్‌కు చెందిన ఏలూరి ఎలిజిబెత్‌రాజు, శివనాగ రాజు కాలనీకి చెందిన తూతిక అలియాస్ పాతూరి సైని, అలియాస్ హనీ, ఒరిస్సా రాష్ట్రంలోని పారిమ గ్రామానికి చెందిన పారిమ జోయామాజిలను అదుపులో తీసుకుని, కేసు నమోదు చేశారు. వీరి వద్ద గల 3.5 కేజీల గంజాయితో పాటు చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు గంజాయి తాగుతున్న ఏసుబాబు, హర్ష సరిఫుద్దీన్, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, అమరజ్యోతి, ఈశ్వర్, మురళి, వీరాస్వామిలు పరారీలో ఉన్నారు. వీరిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. సీఐ ఆరోగ్య రాజు, ఎస్‌ఐలు కృష్ణబాజీ, ఎం.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ చిరంజీవులు, కానిస్టేబుల్ డేవిడ్‌లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

ప్రత్తిపాడులో అత్యధికంగా 60.2 మి.మీ. వర్షం

సగటున 28.5 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లాలో వారం రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 60.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 3.4 మి.మీ. పడింది. సగటున 28.5 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ఫిరంగిపురం మండలంలో 53.8 మి.మీ., చేబ్రోలు 48, దుగ్గిరాల 46.8, వట్టిచెరుకూరు 46.2, తాడేపల్లి 34.6, గుంటూరు పశ్చిమ 33.2, మంగళగిరి 28.6, గుంటూరు తూర్పు 26.4, పెదకాకాని 25.2, పెదనందిపాడు 23.4, తుళ్లూరు 18.4, తెనాలి 16.8, పొన్నూరు 14.6, కొల్లిపర 12.6, తాడికొండ 11.6, కాకుమాను మండలంలో 8.4 మి.మీ. చొప్పున పడింది. సెప్టెంబర్ 22వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 116.9 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 234.9 మి.మీ. నమోదైంది.

పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్స్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర కార్యదర్శి ఆర్. నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, సమానత్వ భావాలతో పాటు దేశభక్తిని పెంపొందిస్తున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఆర్. నరసింహారావు తెలిపారు. సోమవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో గుంటూరు జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వార్షిక సమావేశాన్ని జిల్లా కార్యదర్శి ఎం. ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారావు గుంటూరు జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ రిజిస్ట్రేషన్, బిగినర్స్ కోర్స్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 955 పీఎంశ్రీ పాఠశాలలకు రూ. 50 వేలు చొప్పున విడుదల చేసిన నిధులతో విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఉన్నతమైన సంస్థగా గుర్తింపు పొందిన స్కౌట్స్, గైడ్స్ ఆశయాలకు అనుగుణంగా సేవా భావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని 111 పాఠశాల నుంచి 136 యూనిట్స్ రిజిస్ట్రేషన్ చేశారని వివరించారు. సమావేశంలో ఎస్‌ఓసీ పి. శ్రీనివాసరావు, చేబ్రోలు ఎంఈవో రాయ సుబ్బారావు, పెదకాకాని ఎంఈఓ బీవీ రమణయ్య, డీటీసీ టి. నరేష్, డీఓసీ ఎం.శ్రీ హరి, ఘంటా కిరణ్, కామాక్షి, అనిల్, నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు

కృషి, పట్టుదలతోనే ప్రభుత్వ ఉద్యోగాల సాధన

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు కృషి, పట్టుదలతో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను సాధించాలని కొండిన్య ఐఏఎస్ అకాడమీకి చెందిన అధ్యాపకుడు ఎస్. నవీన్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధతపై వెనిగండ్లలోని కొండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఎంబీఏ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకుడు కోటేశ్వరరావు ప్రభుత్వ పోటీ పరీక్షలైన సివిల్స్, ఎస్సెస్సీతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ, బీపీసీఎల్ వంటి సంస్థల్లో ఉద్యోగావకాశాలను గురించి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కృషి, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా పోటీ పరీక్షలకు సిద్ధమైతే తప్పక విజయం సిద్ధిస్తుందని చెప్పారు. ఎంబీఏ విద్యార్థులు కమ్యూనికేషన్, పరిపాలనా నైపుణ్యాలతో ప్రైవేటు రంగంలోనే కాకుండా, ప్రభుత్వ రంగ సంస్థల్లో సైతం రాణించగలరని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనితాదేవి, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి యు. రవి కుమార్, వాణిజ్య విభాగాధిపతి ఎస్. శ్రీనివాసరావు, అధ్యాపకుడు నాంచారయ్య, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నవీన్

ఉత్కంఠభరితంగా జాతీయ చెస్ పోటీలు

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్‌లో నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్–2025 పోటీలు సోమవారం రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగాయి. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. 2027 ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌కి అర్హత సాధించే టోర్నమెంట్ కావడంతో ఈ పోటీకి విశేష ప్రాధాన్యత ఏర్పడింది. 14 మంది గ్రాండ్ మాస్టర్లు, 30 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు సహా మొత్తం 394 మంది పోటీ బరిలో నిలిచారు. తొలి రౌండ్‌లో ఎక్కువ మంది గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు సునాయాస విజయాలతో రెండో రౌండ్‌కి చేరుకున్నారు.

- రెండో సీడ్ సూర్యశేఖర్ గాంగులి మొదటి రోజు సుదీర్ఘమైన గేమ్‌ను ఆడి, చివరికి తనదైన స్టైల్‌లో విజయం సాధించారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

- రైల్వే జట్టుకు చెందిన గ్రాండ్‌మాస్టర్ దీపన్ చక్రవర్తి, ఐఎం సిద్ధాంత్ మోహపాత్రా ప్రత్యర్థులతో పాయింట్లు పంచుకోవాల్సి వచ్చింది.
- పీఎస్‌పీబీకి చెందిన ఐఎం నిషా మొహోటా, తెలంగాణ ఆటగాడు మోక్షిత్ పసుపులేటి చేతిలో ఓటమి పాలయ్యారు.
- ఆంధ్రప్రదేశ్ అభిమాన ఆటగాడు, 2017 జాతీయ చాంపియన్ లలిత్ బాబు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గగన్ సహూను చాకచక్యంగా ఓడించారు.

స్టాక్ మార్కెట్లు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
466	125
82,160	25,202

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,775	△	143
డోజోన్స్	46,419	△	103
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,232	△	16
డాక్స్	23,533	▽	106
హాంగ్‌సెంగ్	3,829	△	8
నికాయ్	45,494	△	448

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.80	88.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.23	121.22
€	యూరో	ఎస్‌బీఐ	102.23	105.02
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.27	69.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.09	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.50	13.32

పండుగల ముందు పసిడి పరుగు

- ఒకే రోజు రూ.2,200 పెరుగుదల
- ఢిల్లీలో కొత్త గరిష్టం 1,16,200

న్యూఢిల్లీ: పండుగల ముందు పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు ఏకంగా రూ.2,200 పెరిగి మరో కొత్త జీవితకాల గరిష్ట స్థాయి రూ.1,16,200కి చేరుకుంది. వెండి సైతం రూ.4,380 ర్యాలీ చేసి కిలోకి రూ.1,36,380 స్థాయిని (కొత్త ఆల్‌టైమ్ గరిష్టం) తాకింది.



'అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న బుల్లిష్ ధోరణికి అనుగుణంగా దేశీయంగానూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిల్లో ట్రేడయ్యాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది చివరి నాటికి మరో రెండు రేట్ల కోతలు ఉంటాయంటూ సంకేతం ఇవ్వడం డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ బలపడటాన్ని అడ్డుకుంది. ఇది పసిడి, వెండి ధరలకు మద్దతిచ్చింది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే బంగారం ధర 50 డాలర్లకు పైగా పెరిగి 3,760 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది. ఈ ఏడాది ఇప్పటి దాకా దేశీ మార్కెట్లో పసిడి ధరలు 47%, వెండి ధరలు 52% పెరగడం గమనార్హం.

అక్టోబర్ 21న మూరత్ ట్రేడింగ్

ముంబై: దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు అక్టోబర్ 21న గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్' నిర్వహించనున్నాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలై 2.45 గంటలకు ట్రేడింగ్ ముగుస్తుందని ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ తెలిపాయి.



ఈ దీపావళి నుంచి సంవత్ 2082 ఆరంభం కానుంది. ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే.. వచ్చే దీపావళి వరకు లాభాలు వరిస్తాయనే నమ్మకంతో చాలా మంది మూరత్ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. గతేడాది(2024) ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు డీలా | మార్కెట్‌కు హెచ్-1బీ ఫీజు పెంపు సెగ..

స్టాక్ మార్కెట్లే ఇప్పుడు దిక్కు

అమెరికా నుంచి ప్రతికూలతలు ఎదురవుతున్నా... విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగిస్తున్నా... భారత మార్కెట్లు అంతకంతకూ పెరుగుతుండటానికి కారణం దేశీ ఇన్వెస్టర్లకు మార్కెట్లపై ఉన్న నమ్మకమేనని, కొన్నేళ్లుగా వారు కళ్లజూస్తున్న లాభాలే వారిని ఇన్వెస్ట్‌మెంట్‌కు ప్రేరేపిస్తున్నాయని ఎడిల్‌వీజ్ ఏఎంసీ ఎండీ- సీఈఓ రాధికా గుప్తా అభిప్రాయపడ్డారు. వినూత్న ఉత్పత్తులతో ఎడిల్‌వీజ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించి... దేశంలోని అగ్రశ్రేణి మ్యూచువల్‌ఫండ్ కంపెనీల్లో ఒకటిగా మార్చిన రాధికా గుప్తా... నిరంజన్ అవస్థితో కలిసి 'మ్యాంగో మిలియనీర్' అనే పర్సనల్ ఫైనాన్స్ పుస్తకాన్ని రాశారు. దానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటూ 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ 200 లక్షల కోట్లకు చేరుతుందంటున్న రాధికాతో 'సాక్షి' ఇంటర్వ్యూ ఇది...

'సాక్షి'తో ఎడిల్‌వీజ్ ఎండీ-సీఈఓ రాధికా గుప్తా

- ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలేవీ ఆకర్షణీయంగా లేవు
- అందుకే యువత సహా ఇన్వెస్టర్లంతా ఇటు చూస్తున్నారు
- అంతర్జాతీయ ప్రతికూలతలున్నా పెరుగుతున్నది అందుకే...
- గడిచిన కొన్నేళ్లుగా వచ్చిన లాభాలు మార్కెట్లపై నమ్మకం పెంచాయి
- కొన్ని షేర్లలో బబుల్స్ ఉండొచ్చు.. కానీ పునాదులు బలంగా ఉన్నాయి
- లిస్టింగ్ లాభాల కోసం తాడూబొంగరం లేని అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టొద్దు
- దేశ వృద్ధిలో అన్ని రంగాలూ కీలకం.. అందుకే మ్యూచువల్ ఫండ్లు బెటర్
- తక్కువైనా... స్థిరమైన రాబడులతోనే సంపద సృష్టి సాధ్యం



(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

అంతర్జాతీయంగా ఇబ్బందులెదురవుతున్నా భారత మార్కెట్లు కొత్త శిఖరాలను చేరుకోవటానికి కారణం?

యువత ఆకాంక్షలు పెరుగుతున్నాయి. మరోవంక ఇన్వెస్ట్‌మెంట్‌కు మరీ ఎక్కువ ప్రత్యామ్నాయాలేవీ లేవు. ఎందుకంటే బ్యాంకు డిపాజిట్లు చేశారనుకుందాం. పన్నులు పోతే మిగిలేది తక్కువే. పెరుగుతున్న జీవన ప్రమాణాలకిది సరిపోదు. అందుకని సహజంగానే జనం ఈక్విటీ మార్కెట్ల వైపు చూస్తున్నారు. నేను ఎంఎఫ్ పరిశ్రమలో అడుగుపెట్టినపుడు 'సిప్' ద్వారా వచ్చే మొత్తం 4 వేల కోట్లుగా ఉండేది. ఇపుడది 28వేల కోట్లకు చేరింది. ఇందులో అత్యధిక భాగం దీర్ఘకాలికం. అదే ఇక్కడ కీలకం. ప్రత్యేకించి గడిచిన రెండేళ్లుగా మార్కెట్లోకి వస్తున్న కొత్త ఇన్వెస్టర్లకు మంచి లాభాలొస్తున్నాయి.

అయితే ఈ ర్యాలీ చల్లారిపోయేది కాదని, బుడగలేవీ లేవని అంటున్నారా?

స్మాల్‌క్యాప్ కంపెనీలు... కొన్ని థీమ్స్..., కొన్ని కంపెనీల రూపంలో ఈ బబుల్స్ ఉండొచ్చు. పాలపై నురుగు ఓ 20 శాతం తప్పదు. ఏ బుల్ ర్యాలీకైనా ఇది వర్తిస్తుంది. దానర్థం మొత్తం మార్కెట్ ఇలానే ఉందని కాదుకదా? పునాదులు గట్టిగా ఉన్నాయన్నదే నా పాయింట్.

మరి ఇలాంటి సమయంలో రిటైల్ ఇన్వెస్టర్లకు మీరేం చెబుతారు?

అన్నిటికన్నా ముఖ్యం... అతిగా ఆశించకపోవటం. నా పుస్తకంలో కూడా అదే చెప్పాను. చాలామంది ఇన్వెస్టర్లు గత సంవత్సరాన్ని బేరీజు వేసుకుంటూ 30-40 శాతం రాబడి వస్తుందనే అంచనాలతో ఉన్నారు. అది సరికాదు. రెండోది... హైబ్రిడ్ ఫండ్లు, మల్టీ అసెట్ ఫండ్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ల వంటి మధ్యస్థ ఆదాయాన్నిచ్చే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇవి మరీ సంప్రదాయకంగా కాకుండా... మరీ దూకుడుగా కాకుండా మధ్యస్థంగా ఇన్వెస్ట్‌చేస్తాయి. స్థిరంగా నిలకడైన రాబడులనిస్తాయి. సంపద సృష్టించాలంటే అలానే సాధ్యం.

డిఫెన్స్ థీమ్, ప్రభుత్వ బ్యాంకుల థీమ్ అంటూ రకరకాల స్టోరీలను ఈ మధ్య చూస్తున్నాం. చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు వీటిని నమ్ముతున్నారు కదా?

నిజమే!. రిటైలర్లు ఇలాంటి స్టోరీల వెంటనే పరిగెడతారు. చివరకు దురదృష్టకరంగా ఎగ్జిట్ అవుతారు. నేనైతే ఈ థీమ్‌లను నమ్మను. ఏ ఒక్క రంగం వల్లనో దేశం ముందుకెళ్లదు. హోటల్స్, హాస్పిటల్స్, డేటా సెంటర్స్, క్యాపిటల్ మార్కెట్స్, టెక్నాలజీ.. ఇలాంటి రంగాలన్నీ దేశాభివృద్ధితో ముడిపడి ముందుకెళతాయి.

యువత చాలామంది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ చేస్తున్నారు. మీరేమంటారు?

అదో దుర్మార్గం. ఎఫ్ అండ్ ఓ అనేది సంస్థలు రిస్కును తగ్గించుకోవటానికి ఉపయోగించుకోవాల్సిన సాధనం. అంతేతప్ప అప్పులు తెచ్చి ట్రేడింగ్ చేసే యువత కోసం కాదు. విద్యార్థులు, చిన్నచిన్న వర్కర్లు, డ్రైవర్లు రుణాలు తీసుకుని ట్రేడింగ్ చేస్తున్న వ్యవహారాన్ని నేనూ విన్నా. ఇది గ్యాంబ్లింగ్. ప్రమాదకరం. రిటైల్ ఇన్వెస్టర్లు సిప్, మ్యూచువల్ ఫండ్ల ద్వారా తేలిగ్గా సంపద సృష్టించుకోవచ్చు. గ్యాంబ్లింగ్ అవసరం లేదు.

మార్కెట్లో ఏ ఒక్క రంగమైనా మరీ అతిగా పెరిగినట్లు భావిస్తున్నారా?

అలాగని చెప్పలేం. అయితే కొన్ని అన్‌లిస్టెడ్ కంపెనీలు, ఎస్ఎంఈ ఐపీవోల విషయంలో మాత్రం ఆందోళన ఉంది. లిస్టింగ్‌లోనే లాభాలొస్తాయి కదా అని చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు కంపెనీ పూర్వాపరాలేవీ పట్టించుకోకుండా అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పేరు చెప్పలేను కానీ... ఈ మధ్య ఒక ఐపీవోలో దెబ్బతిన్నారు. కొన్ని ఎస్ఎంఈ కంపెనీలూ అంతే. వీటిలో పెద్ద లిక్విడిటీ ఉండదు. పరిస్థితులు అనుకూలించకపోతే ఇరుక్కుపోయే ప్రమాదమే ఎక్కువ. అందుకే నేనెప్పుడూ రిటైల్ ఇన్వెస్టర్లను ఇండెక్స్ ఫండ్లలో గానీ, ఏవైనా ఇతర మ్యూచువల్ ఫండ్లలో గానీ పెట్టుబడి పెట్టమని చెబుతాను.

కానీ కొన్ని కంపెనీలు ఏడాదిలో 50 శాతం... రెండు మూడు రెట్లు పెరగటం చూస్తున్నారు కదా? ఇవి రిటైలర్లను ఆకర్షిస్తాయి కదా?

ఇలా పెరిగిన రెండుమూడు గురించే అంతా చెబుతారు. కానీ కుదేలైన షేర్ల గురించి చెప్పరు. స్టాక్ మార్కెట్లో లాభాలు ఆర్జించిన వారిని తప్ప నష్టపోయిన వారి స్టోరీలు బయటకు రావు. ఇలా ఒక షేర్లో పెట్టి లాభపడ్డ వారు కూడా మిగిలిన షేర్లలో రాబడి గురించి చెప్పరు. ఆ షేర్‌ను ఎంచుకోవటం వెనక వారి శ్రమ, సమయం కూడా ఉంటాయి కదా? ఏడాదికి 10-12 శాతం రాబడినిచ్చే మ్యూచువల్ ఫండ్లు బోరింగ్‌గా అనిపించవచ్చు. కానీ ఆ రాబడి స్థిరంగా ఉంటుంది. సురక్షితం కూడా.

చిన్న పట్టణాల్లో ఇన్వెస్ట్‌మెంట్ సంస్కృతి పెరుగుతోందా?

చాలా. ఎడిల్‌వీజ్‌ను 5 నగరాల్లో ఆరంభించాం. ఇపుడు 60 పట్టణాల్లో ఉన్నాం. త్వరలో 200 పట్టణాలకు విస్తరిస్తాం. స్థానిక భాషల్లో ఆర్థిక పాఠాల లభ్యత.. వారికి సలహాదారులు, డిస్ట్రిబ్యూటర్లు అందుబాటులో ఉండటమన్నదే ప్రధానం.

పాసివ్ (ఇండెక్స్) ఫండ్లకు ఆదరణ పెరుగుతోంది కదా.. మరి యాక్టివ్ ఫండ్లకు వీటితో పోటీ ఉంటుందా?

అలాంటిదేమీ లేదు. చాలామంది ఇన్వెస్టర్లు రెండింట్లోనూ పెట్టుబడి పెడుతున్నారు. బాగా రాబడులనిచ్చిన యాక్టివ్ ఫండ్లలోకి పెట్టుబడులొస్తాయి. లేదంటే పాసివ్ ఫండ్లలోకి వెళతాయి. రెండూ పెరుగుతున్నాయనేది మనం గమనించాలి.

భారత్ బాండ్ ఫండ్ మాదిరి ఎడిల్‌వీజ్ నుంచి కొత్త ఉత్పత్తులేమైనా వస్తున్నాయా?

అక్టోబర్ 1న మేం దేశంలో మొట్టమొదటి హైబ్రిడ్ స్పెషల్ ఇన్వెస్టిమెండ్ ఫండ్‌ను (ఎస్ఐఎఫ్) ఆరంభించబోతున్నాం. సెబీ ఇటీవలే దీనికి అనుమతిచ్చింది. దీన్లో కనీస పెట్టుబడి సైజు రూ.10 లక్షలు. దీన్లో రిస్క్ తక్కువ ఉంటుంది. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్ని బ్యాలెన్స్ చేసుకోవటానికి ఈ ఫండ్ ఉపయోగపడుతుంది.

ఇపుడు చాలామంది ఇన్వెస్టర్లు అమెరికా సహా అంతర్జాతీయ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయాలని చూస్తున్నారు. ఎడిల్‌వీజ్ ప్రణాళికలేంటి?

టెక్నాలజీ, చైనా సహా కొన్ని గ్లోబల్ ఫండ్లను మేం నడిపిస్తున్నాం. కాకుంటే వీటికి ఆర్‌బీఐ పరిమితులున్నాయి. వీటిని గిఫ్ట్ సిటీ ద్వారా అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే గిఫ్ట్‌సిటీలో కార్యాలయాన్ని ఆరంభించాం.

ఐదు పదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ ఎలా ఉండొచ్చు?

2030 నాటికి ఇది 200 లక్షల కోట్లకు చేరుతుందన్నది నా అంచనా. దీన్లో 130-140 లక్షల కోట్లు ఈక్విటీలోనే ఉంటాయి. సిప్ పెట్టుబడులు నెలకు రూ. లక్ష కోట్లను చేరుతాయి. దేశంలో 30-40 శాతం మంది మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయటమే వికసిత భారత్‌కు అర్థమన్నది నా భావన.

రిటైలర్లు తరచూ చేసే తప్పులేంటి?

అతిగా ఆశ పడటం, స్నేహితుల్ని కాపీ కొట్టడం, సోషల్ మీడియా టిప్స్ తీసుకోవటం, ఇన్వెస్ట్‌మెంట్ బదులు ట్రేడింగ్ చెయ్యటం, డైవర్సిఫికేషన్ లేకపోవటం ఇలా చాలానే ఉన్నాయి. నా పుస్తకంలో ఒక చాప్టర్ మొత్తం ఇదే రాశాను. ఇక సోషల్ మీడియా విషయానికొస్తే బాధ్యతాయుతంగా వాడితే అదో గొప్ప సాధనం. కాకపోతే ఆర్థిక సలహా అనేది చాలా సీరియస్ వ్యవహారం. తప్పుడు సలహాల్ని నమ్మితే కష్టపడి సంపాదించిన డబ్బు పోతుంది. చాలామంది ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇన్వెస్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా లైక్‌ల కోసం సలహాలిస్తుంటారు. తెలియని విషయాన్ని చెప్పొద్దన్నది నా సలహా. అర్హులైన నిపుణుల నుంచే సలహాలు తీసుకోవాలి.



భారత్‌కు రానున్న అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్

అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ రెండోసారి భారత్‌కు రానున్నాడు. బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్ల మధ్య అక్టోబర్ 1న ముంబైలో జరిగే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో బోల్ట్ బరిలోకి దిగుతాడు. తొలి అర్ధభాగం బెంగళూరు జట్టుకు, రెండో అర్ధభాగంలో ముంబై జట్టుకు బోల్ట్ ప్రాతినిధ్యం వహిస్తాడు. భారత ఫుట్‌బాలర్లతోపాటు, బాలీవుడ్, ఇతర రంగాల ప్రముఖులు ఈ మ్యాచ్‌లో బోల్ట్‌తో కలిసి సరదాగా ఆడతారు. ప్రముఖ స్పోర్ట్స్ మా తయారీ సంస్థ ప్యూమా ఈ మ్యాచ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ మ్యాచ్‌కంటే ముందు బోల్ట్ సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు ఢిల్లీ, ముంబైలలో పలు ప్రైవేట్ ఈవెంట్లలో పాల్గొంటాడు. 'భారత్‌కు మరోసారి రావడానికి ఉత్సాహంతో ఉన్నాను. క్రీడల పట్ల ఇక్కడి ప్రజలకు ఎంతో మక్కువ ఉంది. భారీ సంఖ్యలో నన్ను అభిమానించే వాళ్లు కూడా ఉన్నారు' అని 2014లో తొలిసారి భారత్‌కు వచ్చిన 39 ఏళ్ల బోల్ట్ వ్యాఖ్యానించాడు. 2017లో అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పిన బోల్ట్ ఒలింపిక్స్‌లో 8 స్వర్ణాలు, ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 11 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యం సాధించాడు.

దివ్య దేశ్‌ముఖ్‌కు వైల్డ్ కార్డు

పురుషుల ప్రపంచకప్ టోర్నీ బరిలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్



న్యూఢిల్లీ: భారత మహిళా గ్రాండ్‌మాస్టర్, మహిళల చెస్ ప్రపంచకప్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఈ ఏడాది మరోసారి పురుషుల ఈవెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఇటీవలే గ్రాండ్ స్విస్ టోర్నీలో పురుష గ్రాండ్‌మాస్టర్లతో పోటీపడ్డ దివ్య... అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 వరకు భారత్‌లోని గోవా వేదికగా జరిగే పురుషుల ప్రపంచకప్ టోర్నీలో బరిలోకి దిగనుంది. వాస్తవానికి దివ్యకు ఈ టోర్నీలో పాల్గొనే అవకాశం లేకపోయినా... చివరి నిమిషంలో ఒక ప్లేయర్ వైదొలగడంతో ఆ స్థానాన్ని దివ్య దేశ్‌ముఖ్‌తో భర్తీ చేశారు. ఈ టోర్నీలో ఆడాలని మహిళల ప్రపంచ నంబర్‌వన్ హు ఇఫాన్ (చైనా), ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)లకు నిర్వాహకులు ఆహ్వానించారు. అయితే ఈ ఇద్దరు చైనా గ్రాండ్ మాస్టర్లు ప్రపంచకప్‌లో ఆడేందుకు రాలేమని తెలిపారు. నాకౌట్ ఫార్మాట్‌లో జరిగే ప్రపంచకప్‌లో మొత్తం 206 మంది ప్లేయర్లు పోటీపడతారు. టాప్-3లో నిలిచిన వారు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు. భారత్ నుంచి ఈ టోర్నీలో 20 మంది ప్లేయర్లు ఆడనున్నారు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్, అరవింద్ చిదంబరం, పెంటేల హరికృష్ణ, నిహాల్ సరీన్, మురళీ కార్తికేయన్, ప్రాణేశ్, ఇనియన్, ఎస్ఎల్ నారాయణన్, దీప్తాయన్ ఘోష్, సూర్యశేఖర గంగూలీ, కార్తీక్ వెంకటరామన్, రాజా రిత్విక్, ఆరోన్యక్ ఘోష్, లలిత్ బాబు, హిమల్ గుసెయిన్, హర్షవర్ధన్, నీలాశ్ సాహా పోటీపడనున్నారు.

ఫుట్‌బాల్‌లోనూ పాక్‌పై భారత్‌దే పైచేయి

కొలంబో: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాకిస్తాన్ జట్టును భారత జట్టు చితక్కొట్టగా... మరోవైపు ఫుట్‌బాల్‌లోనూ పాకిస్తాన్ జట్టుపై భారత్ తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 టోర్నమెంట్‌లో భాగంగా పాకిస్తాన్‌తో సోమవార జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున దలాల్‌మువాన్ గాంగ్టే (31వ నిమిషంలో), గున్లేబా వాంగ్‌ఖెరాక్‌పమ్ (64వ నిమిషంలో), రహాన్ అహ్మద్ (74వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ జట్టుకు హంజా యాసిర్ (71వ నిమిషంలో), మొహమ్మద్ అబ్దుల్లా (43వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఈ విజయంతో భారత్ గ్రూప్ 'బి'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి తొమ్మిది పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఆరు పాయింట్లతో పాకిస్తాన్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్ 'బి' నుంచి



భారత్, పాకిస్తాన్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి. గ్రూప్ 'ఎ' నుంచి బంగ్లాదేశ్, నేపాల్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. ఈనెల 25న జరిగే సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్; నేపాల్‌తో భారత్ తలపడతాయి.

'సమఉజ్జీల సమరం' ఏమాత్రం కాదు!

- పాక్‌తో 'వైరం' అనడంలో అర్థం లేదు
- సూర్యకుమార్ యాదవ్ వ్యాఖ్య



దుబాయ్: 'ఇద్దరు కొట్టుకుంటే యుద్ధం...అదే ఒకడు మీద పడిపోతే దండయాత్ర'... తెలుగు సినిమాలో ఒక డైలాగ్ ఇది. భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సరిగ్గా ఇదే అర్థం వచ్చేలా పాకిస్తాన్ గురించి చెప్పాడు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ అంటే ఇప్పుడు పూర్తిగా ఏకపక్షమని అతను గుర్తు చేశాడు. అసలు ఇరు జట్ల మధ్య ఆటను 'వైరం'తో పోల్చాల్సిన అవసరమే లేదని అతను స్పష్టం చేశాడు. భారత్, పాక్ మధ్య 2018 నుంచి జరిగిన గత 7 వన్డేల్లో భారత్ 6 గెలవగా, 1 మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఇరు జట్ల మధ్య మొత్తం 15 టి20 మ్యాచ్‌లు జరగ్గా... భారత్ 11 గెలిచి, 3 మాత్రమే ఓడింది. వరుసగా గత 4 మ్యాచ్‌లలో మనదే పైచేయి. 2022లో ఓటమి తర్వాత రెండు ఫార్మాట్‌లు కలిపి మన జట్టు వరుసగా 7 మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో టీమిండియా ఆధిపత్యంపై సూర్య తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. 'భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లకు 'వైరం' అనే మాటను ఇకపై వాడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. అసలు ఇరు జట్ల మధ్య వైరం అనాల్సినంతగా పోటీ ఎక్కడ ఉంది. నా అభిప్రాయం ప్రకారం రెండు జట్ల మధ్య 15-20 మ్యాచ్‌లు జరిగి ఇద్దరూ 7-7తో సమంగా ఉండి లేదా 8-7తో కాస్త ఆధిక్యంలో ఉంటే సమ ఉజ్జీల సమరం అని చెప్పవచ్చు. కానీ సరిగ్గా అంకెలు గుర్తు లేవు కానీ ప్రస్తుతం ఇది 13-0 లేదా 10-1గా ఉంది. కాబట్టి ఇకపై ఇది అసలు పోటీనే కాదు' అని సూర్య ఘాటుగా వ్యాఖ్యానించాడు.

దూబే స్పెల్ కీలక మలుపు...

పాక్ ఇన్నింగ్స్ డ్రింక్స్ విరామ సమయంలో ఆట మలుపు తిరిగిందని సూర్యకుమార్ అన్నాడు. సాధారణంగా పవర్‌ప్లే తర్వాత ఆట మారుతుందని, కానీ 10-17 ఓవర్ల మధ్య తాము పాక్‌ను కట్టడి చేయడంలో సఫలమయ్యామని కెప్టెన్ చెప్పాడు. ఈ 8 ఓవర్లలో పాక్ 38 పరుగులు మాత్రమే చేయగలిగింది. 'స్పిన్నర్లు బాగానే బౌలింగ్ చేసినా నా దృష్టిలో శివమ్ దూబే స్పెల్ ఆటను మలుపు తిప్పింది. ఈసారి అతను తనకు లభించిన అవకాశాన్ని సమర్థంగా వాడుకుంటూ పూర్తి కోటా ఓవర్లు బౌలింగ్ చేశాడు. ప్రాక్టీస్ సెషన్లలో దూబే బౌలింగ్‌లో బాగా శ్రమించాడు. కొత్త బంతితో కూడా సాధన చేశాడు. ఈ మ్యాచ్‌లో పక్కా ప్రణాళికతో అతను వచ్చాడు' అని సూర్య చెప్పాడు. మరోవైపు నీరు-నిప్పులాంటి గిల్, అభిషేక్ భాగస్వామ్యంపై కూడా సారథి ప్రశంసలు కురిపించాడు. 'అభిషేక్ బ్యాటింగ్ శైలి అలాగే ఉంటుంది. పవర్‌ప్లే తర్వాత కూడా అతను తగ్గడు. గిల్ ఎలా ఆడతాడో కూడా అందరికీ తెలుసు. ఏ రకంగానైనా అతను పరుగులు రాబట్టగలడు. మైదానం బయట కూడా మంచి స్నేహం ఉంటే ఫలితం ఎలా ఉంటుందో వీరిద్దరు చూపించారు. నీరు-నిప్పులాంటి వీరిద్దరు కలిసి ఆడుతుంటే సమన్వయానికి ఒక కనుసైగ చాలు' అని కెప్టెన్ వ్యాఖ్యానించాడు.

'వాళ్లు అలా చేయడం నచ్చలేదు'



భారత్, పాక్ మ్యాచ్‌లలో సహజంగా కనిపించే కవ్వింపులు, మాటల యుద్ధం ఆదివారం మ్యాచ్‌లో కూడా కనిపించింది. వేర్వేరు సందర్భాల్లో అభిషేక్ శర్మ, శుబ్‌మన్ గిల్‌లకు హారిస్ రవూఫ్, షాహిన్ అఫ్రిదిలతో వివాదం రేగింది. దీనిపై మ్యాచ్ తర్వాత అభిషేక్ స్పష్టతనిచ్చాడు. పాక్ ఆటగాళ్ల ప్రవర్తన వల్లే తాను స్పందించాల్సి వచ్చిందని అతను చెప్పాడు. 'ఎలాంటి కారణం లేకుండా వారు మాపైకి దూసుకొచ్చి కవ్వించే ప్రయత్నం చేశారు. అది నాకు అస్సలు నచ్చలేదు. నేను దూకుడుగా ఆడి చెలరేగడమే దానికి సరైన మందు అని భావించాను' అని అభిషేక్ వెల్లడించాడు. తన బాల్య మిత్రుడు గిల్‌తో కలిసి భారీ భాగస్వామ్యం నెలకొల్పడం, అది జట్టు విజయానికి కారణం కావడం పట్ల అభిషేక్ సంతోషం వ్యక్తం చేశాడు. మరోవైపు హాఫ్ సెంచరీ చేశాక తాను గన్ షూటింగ్ తరహాలో చేసిన సంబరంలో ఎలాంటి తప్పూ లేదని పాక్ బ్యాటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ అన్నాడు. 'ఆ క్షణంలో వచ్చిన ఆలోచనతోనే నేను గన్ తరహాలో బ్యాట్‌తో అలా చేశాను. నేను సాధారణంగా 50 దాటినప్పుడు ఎలాంటి సంబరాలు చేసుకోను. అప్పటికప్పుడు నాకు అలా చేయాలనిపించింది. జనం దాని గురించి ఎలా ఆలోచిస్తారనేది నాకు అనవసరం. దానిని నేను పట్టించుకోను' అని ఫర్హాన్ స్పష్టం చేశాడు.



చావో రేవో మ్యాచ్

- నేడు పాకిస్తాన్‌తో శ్రీలంక ఢీ
- ఆసియా కప్ టి20 టోర్నీ

అబుదాబి: ఆసియా కప్ సూపర్-4 దశలో తమ తొలి మ్యాచ్‌ల్లో ఓడిన రెండు జట్లు కీలక సమరానికి సన్నద్ధమయ్యాయి. నేడు జరిగే పోరులో పాకిస్తాన్‌తో శ్రీలంక తలపడుతుంది. లీగ్ దశలో అజేయంగా నిలిచిన శ్రీలంక గత పోరులో అనూహ్యంగా బంగ్లాదేశ్ చేతిలో ఓడగా... భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తయింది. ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. సూపర్-4లో రెండో పరాజయం ఎదురైతే ముందంజ వేసే అవకాశాలు దాదాపుగా ముగిసిపోతాయి. ఈ నేపథ్యంలో ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరం. భారత్ చేతిలో ఓడిన మ్యాచ్‌లో ఆరంభంలో పాక్ బ్యాటింగ్ మెరుగ్గానే కనిపించింది. టాప్-3 బ్యాటర్లు ఫఖర్, ఫర్హాన్, అయూబ్ రాణించారు. అయితే జట్టు మిడిలార్డర్ మరీ పేలవంగా కనిపిస్తోంది. తలత్, నవాజ్, కెప్టెన్ సల్మాన్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నారు. పాక్ బౌలింగ్ కూడా గొప్పగా లేదు. మరోవైపు శ్రీలంక కూడా బ్యాటింగ్ వైఫల్యం వల్లే బంగ్లా చేతిలో ఓటమిపాలైంది. అయితే లీగ్‌లో ఆటగాళ్ల ప్రదర్శనను బట్టి చూస్తే ఆ జట్టు కోలుకునే అవకాశం ఉంది. ప్రధాన బ్యాటర్లు కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, నిసాంకపై అంచనాలు ఉండగా... బౌలింగ్‌లో చమీరా, హసరంగ రాణిస్తున్నారు. ఆల్‌రౌండర్‌గా షనక ప్రభావం చూపించాడు. ఇప్పటి వరకు ఆకట్టుకోని కెప్టెన్ అసలంక ఒక మంచి ఇన్నింగ్స్ ఆడాలని టీమ్ కోరుకుంటోంది.

మళ్లీ 'క్యాబ్' అధ్యక్షుడిగా గంగూలీ | విండీస్‌తో సిరీస్‌కు పంత్ దూరం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో